విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాష పై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక
అనంతపురం 5
శ్రీ సత్యసాయి
బుధవారం 29 ఏప్రిల్ 2026



● డీఐజీ, ఎస్పీ చర్యలు బాగున్నాయి..!
● అయితే పాత్రదారులైన పోలీసులను మాత్రమే బలిచేయొద్దు..!
● వారి వెనుక ఉండి అన్ని విధాలా ప్రోత్సహించిన సూత్రదారులపై చర్యలు తీసుకోవాలి..!
● ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యుల పేర్లు వినిపిస్తున్నాయి..!
● పేదింటి అమ్మాయిలను ఈ ఉచ్చులోకి దింపి వ్యాపారం చేస్తారా..!
● 10 వేలమందికి మెసేజ్‌లు పంపి...వందమంది దాకా ట్రాప్ చేశారు..!
● రాప్తాడు సీఐ శ్రీహర్ష 2024లో వచ్చినప్పటి నుంచి మట్టిమాఫియాకు కొమ్ము కాస్తున్నాడు..!
● ప్రశ్నించిన రైతులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు ఏకపక్షంగా వసూళ్లు చేశాడనే ఆరోపణలు ఉన్నాయి..!

# హనీట్రాప్ కేసులో సూత్రదారులను పట్టుకోవాలి..!



అనంతపురం, ఏప్రిల్ 28 (అనంత ప్రభ)
హనీట్రాప్ దందా వెలుగులోకి రావడంతో రాష్ట్రమంతా ఈరోజు జిల్లావైపు చూస్తోందని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గం సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మండిపడ్డారు. మంగళవారం జిల్లా వైఎస్సార్‌సిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతపురం జిల్లా అంటే సత్యసాయి, ఫాదర్ విన్సెంట్, తరిమెల నాగిరెడ్డి ఇలా కారుణజన్ముల సేవలందించిన ఈ ప్రాంతం. గతంలో ఫ్యాక్షన్ జిల్లాగా కూడా పేరుంది. ఫ్యాక్షన్ మరకలు అంటించిన వ్యక్తులు చరిత్రలో కలిసిపోయినా వారి అనవాళ్లు జిల్లాకు మచ్చను తెచ్చేటువంటి అనేక కార్యక్రమాలు చేస్తున్నారు..

సమాజంలో గౌరవకంగా బతుకుతున్న వారిని ఎంచుకుని వారి నంబర్లు సేకరించి వాట్సాప్‌ల ద్వారా మెసేజ్‌లు పెట్టి ముగ్గులోకి లాగి తర్వాత వ్యక్తిగత ప్రదేశాలకు తీసుకెళ్లి న్యూడ్‌గా తయారు చేసి వీడియోలు, ఫోటోలు తీసిన తర్వాత ముఠా సభ్యులు ప్రవేశించి నానా హంగామా చేసి, బెదిరించి డబ్బులు వసూళ్లు చేయడం, బాండ్లు రాయించుకోవడం, ఆస్తులు రాయించుకునే హనీట్రాప్ మాఫియా జిల్లాలో నడుస్తోంది.

ఆలస్యంగా వెలుగులోకి వచ్చినా డీఐజీ, ఎస్పీ నేతృత్వంలో బాగా స్పందించారు. పాత్రదారులందరినీ అరెస్ట్ చేశారు. చాలామంది పోలీసు అధికారులపైనా చర్యలు తీసుకున్నారు. అయితే పాత్రదారులకు పరిమితమై సూత్రదారులను వదిలేస్తారా?.

సహజంగా ఏ నియోజకవర్గంలోనైనా ఎమ్మెల్యేలు సిఫార్సు చేసిన వారినే సీఐలు, ఎస్ఐలుగా నియమిస్తారు. అలాంటి పోలీసు అధికారులు కోట్ల రూపాయలు దందా చేసుకుంటే స్థానిక ఎమ్మెల్యేలకు వాటాలు ఇవ్వరా? ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్న వారి కుటుంబ సభ్యులకు తెలీకుండా ఇవన్నీ జరుగుతాయా?

గతంలో ఇటుకలపల్లి సీఐగా పని చేసిన రాజేంద్రనాథ్‌యాదవ్...హత్య కేసు విషయంలో ఆయనను బదిలీ చేశారు. హత్య కేసులో పరిటాల శ్రీరామ్‌తో పాటు సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్‌పై కూడా ఆరోపణలు వచ్చాయి. హత్య జరుగుతుందనే సమాచారం ఉన్నా..ఆయన ముందస్తు చర్యలు తీసుకోలేదనే విమర్శలున్నాయి.

రాప్తాడు సీఐ శ్రీహర్ష...గతంలో ధర్మవరం నియోజకర్గంలో పని చేశాడు. ఈయన కూడా 2024లో వచ్చినప్పటి నుంచి కూడా మట్టిమాఫియాకు కొమ్ము కాస్తున్నాడు. ప్రశ్నించిన రైతులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏకపక్షంగా వసూళ్లు చేశాడనే ఆరోపణలు ఉన్నాయి. పరిటాల సునీత సోదరుడు మురళీకి చెందిన హోటల్‌లో నిత్యం కూర్చునేవాడు. మురళీతో ఎప్పుడూ టచ్‌లో ఉండేవాడు. ఫోన్‌కాల్స్, వాట్సాప్ చాటింగ్ తెప్పించినా ఇవి బయటపడతాయి. మురళీ కనుసన్నల్లోనే శ్రీహర్ష వ్యవహారమంతా నడిపేవాడు.

సెవెన్‌హిల్స్ హోటల్ నిర్వాహకురాలు, హంపాపురం ఎంపీటీసీ సభ్యుడు రవికి భార్యగా పిలుస్తున్న రంగమ్మ చరిత్ర చాలా దారుణం. గతంలో రాప్తాడు వద్ద హత్యకు గురైన చిట్రా మురళి కేసులో కూడా ఈమెపాత్ర ఉందనే ప్రచారం జరిగింది. మద్దెలచెరువు సూరి ప్రధాన అనుచరుడు భానుకోట కిష్టప్పపై కాల్పులు జరిపిన కేసులో ఈమె బంధువు ముద్దాయి అని తెలుస్తోంది. షెక్షానుపల్లికి చెందిన ఓ వ్యక్తిని ఆర్టీసీ బస్టాండులో పోలీసుల ఎదుటే హత్య చేసిన కేసులో ఈమె భర్త జైలుకు వెళ్లొచ్చాడనే విషయాలు బయటకు వస్తున్నాయి. ఆ కేసులో మరో ముద్దాయిగా పిలవబడుతున్న మనోహర్‌నాయుడు, ఈమెకు సన్నిహితుడైన జయకృష్ణ వీరంతా పరిటాల సునీత అనుచరులు.

రంగమ్మ హోటల్ వద్ద మురళీ, సీఐ శ్రీహర్ష, రంగమ్మ నిత్యం కలిసేశారనే విషయం ఆ ప్రాంతమందరికీ తెలుసు. మురళీ చెప్పినట్లు శ్రీహర్ష వింటే, మహేంద్ర చెప్పినట్లు ఎస్ఐ రాంబాబు వినేవారు. 90 శాతం వాటాదారులైన రాజకీయనాయకులను వదిలిపెట్టి కేవలం 10 శాతం వాటాదారులైన పోలీసులపై చర్యలు తీసుకోవడం ఏంటి. దీని వెనుక ఉన్న బీజేపీ, టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలి.

ఈమె పుట్టు పూర్వోత్తరాలన్నీ రాప్తాడు నియోజకవర్గంలో ఉండి ఇంత స్థాయిలో పోలీసు అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటే ఇందులో ఎమ్మెల్యే పరిటాల సునీతకు సంబంధం లేదంటే హాస్యాస్పదం.

నాలుగు ముఠాలుగా ఏర్పడి హనీట్రాప్ పేరుతో బ్లాక్‌మెయిల్ చేసి సుమారు 100 కోట్ల దాకా వసూళ్లు చేసినట్లు తెలిసింది. ధర్మవరం పట్టణంలో ఒక్క చేనేత వర్గం నుంచే 25 కోట్లు వసూళ్లు చేసినట్లు తెలిసింది.

మజ్జిగ లింగమయ్య కేసులో ఫిర్యాదులో ఉన్న ముద్దాయిలను తప్పించేందుకు పరిటాల సునీత పోలీసు అధికారులపై తీవ్ర ఒత్తిళ్లు తెచ్చారు. చివరకు రామగిరి ఎస్ఐ సుధాకర్‌యాదవ్‌ను వీఆర్‌కు పంపారు.

నాయకులను తృప్తి పరచడానికి బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేదింటి పిల్లలను పంపి చీకటిదందాను నడిపిస్తున్నారు. రాజకీయాల్ని అడ్డుపెట్టుకుని అమ్మాయిల మానప్రాణాలతో చెలగాటం ఆడతారా?. మీ కుటుంబాల్లో ఇలాంటి అంశాలపై చర్చిస్తారా? సిగ్గు అనిపించలేదా?

పోలీసులను డోర్ మ్యాట్లుగా వాడుకుని వారితో ల్యాండ్ మాఫియా నడిపించారు. పేరూరు డ్యాం కింద వెయ్యికోట్ల విలువైన ఇసుక అమ్ముకున్నారు. పాపంపేటలో డబుల్ రిజిస్ట్రేషన్లతో జనాలను బెంబేలిత్తించారు.

తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఒక ట్రాక్టర్ ఇసుక కూడా తెచ్చుకోలేదు. ఎవరిదైనా ట్రాక్టరును పట్టుకున్నారంటే విడిపించలేకపోయాం. ఈరోజు పోలీసు అండదండలతో మట్టి దందా చేస్తున్నారు. టమాటా మండీలో పరిటాల ట్యాక్స్ లారీకి 2 వేలు చొప్పున దోచుకుంటున్నారు.

జగనన్నకాలనీల్లో దొంగతనాలు చేస్తున్నారంటే ఈ పోలీసు అధికారులెవరూ కనీసం స్పందించలేదు. దొంగల సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేశారు.

హనీట్రాప్ కేసులో పోలీసులను మాత్రమే బలిచేయొద్దు. వారి వెనుక ఉండి ఆదేశాలిచ్చిన ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలి. డీఐజీ, ఎస్పీ నిష్పక్షపాతంగా విచారిస్తున్నారనే విశ్వసిస్తున్నాం. లేదంటే సీఐడీ విచారణ వేయండి. జిల్లాను కాపాడండి.

మాకు గతంలో ఫ్యాక్షన్ మరకలు అంటించారు. వాటి నుంచి బయటపడ్డాం. గతంలో కాల్‌మనీ సెక్స్ రాకెట్ జరిగేదని ఇప్పుడు వలపు వల దందా చేయడం సిగ్గుచేటు. ఇందుకోసం రాజకీయాలను ఉపయోగించుకోవడం బాధాకరం. ఇప్పటికైనా హనీట్రాప్ నిర్వహించిన, ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

## ఉచిత కృత్రిమ అవయవాల కొలతల సేకరణ కార్యక్రమం

ధర్మవరం, ఏప్రిల్ 28 (అనంత ప్రభ)
ధర్మవరం నియోజకవర్గంలోని వికలాంగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ గారి ప్రత్యేక చొరవతో ధర్మవరం పోతుకుంట ఏరియా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ఉచిత కృత్రిమ అవయవాల కొలతల సేకరణ కార్యక్రమం రెండో రోజు కూడా అత్యంత విజయవంతంగా ముగిసినట్లు మంత్రి కార్యాలయం తెలిపింది. సంస్కృతి సేవా సమితి మరియు భగవాన్ మహావీర్ వికలాంగ సహాయత సమితి (దీవీఎూా) సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని మంత్రి కార్యాలయం పేర్కొంది. రెండో రోజు నిర్వహించిన ఓపీడీలో మొత్తం 110 మంది వికలాంగులు నమోదు చేసుకోగా, మోకాలి పైభాగం సమస్యలతో 38 మంది, మోకాలి కింది భాగం సమస్యలతో 40 మంది, కాఫో (మోకాలు--చీలమండ--పాద ఆర్థోసిస్) కోసం 10 మంది, ట్రైసైకిళ్ల కోసం 6 మంది, కృత్రిమ చేతుల కోసం 10 మంది, ఊతకర్రల కోసం 6 మంది తమ వివరాలు నమోదు చేసుకున్నట్లు వివరించింది. ఈ మేరకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిబిరంలో మొత్తం 212 మంది లబ్ధిదారులకు వైద్య నిపుణుల బృందం విజయవంతంగా కొలతలు సేకరించినట్లు మంత్రి కార్యాలయం వెల్లడించింది. గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వికలాంగులు హాజరై, ఎటువంటి ఖర్చు లేకుండా అత్యాధునిక సేవలను పొందడం ఈ కార్యక్రమం విజయానికి నిదర్శనమని పేర్కొంది. సేకరించిన కొలతల ఆధారంగా సిద్ధం చేసిన కృత్రిమ కాళ్లు, చేతులు మరియు ఇతర సహాయక పరికరాలను ఈ నెల 29వ తేదీన స్వయంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ గారి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు మంత్రి కార్యాలయం తెలిపింది. వికలాంగుల జీవితాల్లో శారీరక వైకల్యం అడ్డంకిగా మారకుండా, వారు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు మంత్రి గారు కట్టుబడి ఉన్నారని పేర్కొంది. సంస్కృతి సేవా సమితి ద్వారా ప్రజలకు చేరువవుతున్న ఆరోగ్య సేవలు ధర్మవరం నియోజకవర్గంలో సార్థక మార్పులను తీసుకొస్తున్నాయని మంత్రి కార్యాలయం వివరించింది. ఈ కార్యక్రమం ద్వారా



వికలాంగులకు కొత్త జీవనావకాశాలు లభిస్తున్నాయని, సేవే లక్ష్యంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ గారు ముందుకు సాగుతున్నారు అని పేర్కొంది. అలాగే రేపు నిర్వహించనున్న భారీ పంపిణీ కార్యక్రమం కోసం సంస్కృతి సేవా సమితి మరియు దీవీఎూా ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మంత్రి కార్యాలయం వెల్లడించింది.

## రైతులకు అవగాహన కల్పించిన వ్యవసాయ అధికారులు






యాడికి, ఏప్రిల్ 28 (అనంత ప్రభ )
యాడికి మండలంలో గుత్తి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటరాముడు యాడికి మండలం వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా తో కలసి రైతులకు పలు సూచనలు చేశారు. యాడికి మండలం టి కొత్తపల్లి గ్రామంలో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ విధానం ద్వారా విత్తనాలను నాటే విధానాన్ని పరిశీలించారు.ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం వచ్చే అవకాశాలు ఉన్నందున రైతులు ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతిలో 16 నుంచి 25 రోజుల ముందుగానే విత్తనాలు పొలాల్లో వేసుకుంటే మంచి దిగుబడులు పొందే అవకాశం ఉందని సూచించారు. అనంతరం యాడికి రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశమై రాబోయే ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా స్వల్పకాల పంటలైన జొన్న, సజ్జ, కొర్ర వంటి పంటలను సాగు చేస్తే తక్కువ ఖర్చుతో ఆదాయం పొందవచ్చని వివరించారు. అలాగే జాతీయ ఆహార భద్రతా మిషన్ కింద రైతులకు పీఆర్‌జీ రకం కందుల విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం సుఫలా ఫర్టిలైజర్స్ దుకాణాన్ని తనిఖీ చేసి రికార్డులు, నిల్వలను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందించడంతో పాటు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని దుకాణ నిర్వాహకులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

## నగరంలోని ఎమ్మెల్యే దగ్గుపాటి మరోసారి ఆకస్మిక పర్యటన

అనంతపురం, ఏప్రిల్ 28 (అనంత ప్రభ)
అనంతపురం నగరంలో మరోసారి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆకస్మిక పర్యటన చేశారు. మంగళవారం తెల్లవారుజామున కమిషనర్ జశ్వంత్ రావు, టిడిపి నాయకులతో కలిసి ఆయన పలు కాలనీల్లో తిరిగారు. 26వ డివిజన్లోని రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్ పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నూతనంగా వేసిన రోడ్డును పరిశీలించారు. అనంతరం రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్ కు వెళ్లారు. అక్కడ మార్నింగ్ వాకర్స్, మహిళలతో మాట్లాడారు. పార్కులో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే తాగునీరు, టాయిలెట్స్ వంటి మౌలిక వసతులు గురించి ఆరా తీశారు. జిమ్ పరికరాలన్నీ బాగా పనిచేస్తున్నాయా లేదా అని పార్కు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కొన్నిచోట్ల రిపేర్లు ఉన్నాయని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా పార్కులకు చిన్నారులు, తల్లిదండ్రులు ఎక్కువగా వస్తున్నారని అందుకే ఎక్కడా సమస్యలు లేకుండా



చూస్తున్నట్లు తెలిపారు. నగరంలోని 28 పార్కుల్లోని సమస్యలను స్పెషల్ డ్రైవ్ చేపట్టి పరిష్కరిస్తామని చెప్పారు. తాగునీరు, టాయిలెట్స్ వంటి సౌకర్యాలు కచ్చితంగా ఉండేలా చూస్తామన్నారు. జిమ్ పరికరాలన్నీ మరమ్మతులు చేస్తామని చెప్పారు. నగరవాసులకు ఆహ్లాదాన్ని పంచే విధంగా పార్కులు ఉంటాయని స్పష్టం చేశారు. మరోవైపు నగరంలో గతం కంటే పారిశుద్ధ్యం మెరుగుపడిందని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి భవిష్యత్తులో కూడా ఆకస్మిక పర్యటనలు ఉంటాయని.. ఎక్కడైనా లోపాలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరిస్తున్నట్లు ఆయన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు

## పరిశ్రమల ఏర్పాటుతోనే జిల్లా అభివృద్ధి : జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి, ఏప్రిల్ 28 (అనంత ప్రభ )
పరిశ్రమల ఏర్పాటుతోనే జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు.
కలెక్టరేట్ లోని మినీ కన్ఫారెన్స్ హాలు నందు జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విశాఖపట్నం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని రకాల అనుమతులను వెంటనే జారీ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.
పరిశ్రమల స్థాపనకు దరఖాస్తు చేసుకున్న వారికి 'సింగిల్ డెస్క్ పోర్టల్' ద్వారా వేగంగా అనుమతులు మంజూరు చేయాలని సూచించారు.కేంద్ర ప్రభుత్వ పథకాలైన లిపీఎం ఈ జి పిలి మరియు లిపీఎం విశ్వకర్మలి అమలు తీరును సమీక్షించారు. లబ్ధిదారులతో



నేరుగా మాట్లాడి వారి యూనిట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఒప్పందాలు కుదుర్చుకున్న పరిశ్రమలకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు.జిల్లాలో వివిధ పాలసీల కింద ప్రోత్సాహకాల కోసం దరఖాస్తు చేసుకున్న 13 పరిశ్రమలకు రాయితీలను మంజూరు చేశారు.
ఈ కార్యక్రమంలో ఎల్ డి ఎం రమణకుమార్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నాగరాజ , ఏపీఐఐసీ జడ్ఎం నాగకుమార్ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు

## అగాపే వృద్ధాశ్రమంలో అన్నదానం



యాడికి, ఏప్రిల్ 28 (అనంత ప్రభ )

యాడికి మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆశ్రమ నిర్వాహకుడు బత్తల ప్రసాద్ తెలిపారు. దేరంగుల ఆదినారాయణ భార్య లక్ష్మి, కుమార్తె సంగీత, అల్లుడు సత్యనారాయణ, మనవడు తేజేశ్వర్‌తో పాటు బాలవెంకటమ్మ, నాగేశ్వరమ్మ,నందీశ్వర్ కుటుంబ సభ్యులు కలసి ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.తమ తల్లిదండ్రులకు సేవ చేసినట్లే భావిస్తూ, ఎలాంటి ప్రత్యేక సందర్భం లేకపోయినా ఆశ్రమంలోని వృద్ధులు, నిరాశ్రయులకు భోజన వసతి కల్పించి కుటుంబ సభ్యులంతా కలిసి సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ ఫౌండర్ బత్తల ప్రసాద్ మాట్లాడుతూ సేవా భావంతో ముందుకు వచ్చి అన్నదానం నిర్వహించిన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు

## రాయలచెరువు పీహెచ్సీ లో టిబి స్క్రీనింగ్ శిబిరం



యాడికి, ఏప్రిల్ 28 (అనంత ప్రభ )

యాడికి మండలం రాయల చెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టిబిఎంబీఏ 2.0 నేషనల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రత్యేక టిబి స్క్రీనింగ్ శిబిరం నిర్వహించామని, నేడు కూడా ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.హ్యాండ్‌హెల్డ్ ఎక్స్‌రే యంత్రం ద్వారా అధిక ప్రమాదంలో ఉన్న సున్నిత వర్గాల వారికి క్షయవ్యాధి పరీక్షలు నిర్వహించనున్నట్లు డాక్టర్ దేవరాజన్, డాక్టర్ అప్పయ్య వెల్లడించారు. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు బాధితులు, టిబి రోగులతో సన్నిహితంగా ఉన్నవారు, అలాగే 70 సంవత్సరాలు పైబడిన వృద్ధులు ఈ స్క్రీనింగ్‌లో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ముందస్తుగా వ్యాధిని గుర్తించి చికిత్స పొందాలని వైద్యులు కోరారు.

## మండగిరి పంచాయతీ కార్యాలయంలో వైఎస్ఆర్సిపి వినతి పత్రం -- మంచినీటి సమస్యపై ఆగ్రహం



ఆదోని, ఏప్రిల్ 28 (అనంత ప్రభ )

ఈరోజు మండగిరి పంచాయతీ కార్యాలయంలో డి.ఎల్.పి.ఓ ఆఫీసర్ మేడమ్‌కు వైఎస్ఆర్సిపి ఆదోని పట్టణ అధ్యక్షుడు బి. దేవా, పార్టీ నాయకులతో కలిసి వినతి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా బి. దేవా మాట్లాడుతూ, స్టేట్ బ్యాంక్ కాలనీ, శ్రీరామ నగర్, తిరుమల నగర్, సీతారాం నగర్, పోస్టల్ కాలనీ ప్రాంతాల్లో మంచినీటి సరఫరా తీవ్రంగా లోపిస్తున్నదని తెలిపారు. వారానికి ఒక్కసారి, అది కూడా కేవలం గంట లేదా అరగంట మాత్రమే నీళ్లు ఇస్తున్నారని, కొన్నిసార్లు 15 రోజులకు ఒకసారి మాత్రమే నీరు వదులుతున్నారని ఆరోపించారు.అధికారులు పంచాయతీ పన్నులు వసూలు చేస్తూ, ప్రజలకు సరైన సేవలు అందించడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే పార్థసారథి మీడియాలో అభివృద్ధి గురించి పెద్దఎత్తున మాట్లాడుతున్నప్పటికీ, వాస్తవంగా ఆదోని అభివృద్ధి శూన్యంగా ఉందని అన్నారు.ఈ పంచాయతీ పరిధిలో కనీసం వారానికి రెండు సార్లు, ప్రతి సారి 2--3 గంటల పాటు మంచినీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వైఎస్ఆర్సిపి పార్టీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మని, తాయెర్, హరికృష్ణ, ప్రభు తదితరులు పాల్గొన్నారు

## పుకార్ల వల్లే రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత నూర్ అహ్మద్




ఆదోని, ఏప్రిల్ 28 (అనంత ప్రభ )

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో సోషల్ మీడియా మరియు కొన్ని పత్రికల ద్వారా ప్రభుత్వాన్ని అపఖ్యాతి పాలుచేయాలనే ఉద్దేశంతో కొందరు వ్యక్తులు పెట్రోల్, డీజిల్ కొరత ఉందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి ఆలూరు నూర్ అహ్మద్ ఆరోపించారు.ఈ పుకార్ల కారణంగా ప్రజలు ఆందోళనకు గురై అవసరానికి మించి పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని కొందరు దుర్వినియోగం చేసుకుని వేలాది లీటర్ల ఇంధనాన్ని నిల్వ చేసి బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్నారని మండిపడ్డారు.దీని వల్ల సామాన్య ప్రజలకు పెట్రోల్, డీజిల్ అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నాటక రాష్ట్రంలో ఇంధనం విరివిగా లభిస్తోందని, దీనిబట్టి ఇంధన కొరత లేదని స్పష్టమవుతోందన్నారు.కొంతమంది వ్యక్తులు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై చెడ్డపేరు తెచ్చే కుట్రలో భాగంగా ఈ పుకార్లను వ్యాప్తి చేస్తున్నారని ఆరోపించారు.

కావున రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్న వారిపై కార్డన్ సెర్చ్ నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే సోషల్ మీడియా మరియు ఇతర మాధ్యమాలలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి శిక్షించాలని నూర్ అహ్మద్ డిమాండ్ చేశారు.

## పీఎం విశ్వకర్మ పథకాన్ని చేతివృత్తుల వారు సద్వినియోగపరుచుకోవాలి



పుట్టపర్తి, ఏప్రిల్ 28 (అనంత ప్రభ )

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యా అభివృద్ధి సంస్థ మరియు జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 17 రకాల చేతివృత్తుల వారికి ప్రధానమంత్రి విశ్వకర్మ స్కీం కింద శిక్షణ ఇవ్వడం జరిగింది. ప్రధానమంత్రి విశ్వకర్మ ప్రోగ్రాం లో భాగంగా శిక్షణ పొందిన వారికి 15000 రూపాయల విలువ చేసే పనిముట్లు, ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు.

అదేవిధంగా విశ్వకర్మల యొక్క ఆర్థిక అభివృద్ధి జరగటానికి ఈ ప్రోగ్రాం లో భాగంగా శిక్షణ పొందిన వారికి బ్యాంకుల ద్వారా లక్ష రూపాయల వరకు రుణ సదుపాయం కల్పించబడుతుందని తెలియజేశారు.

ఈరోజు శిక్షణ పొందిన వారికి జిల్లా కలెక్టర్ గారు సర్టిఫికెట్స్ ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పంపిణీ చేయడం జరిగింది.

శ్రీ ఏ. శ్యామ్ ప్రసాద్ ఐఏఎస్ జిల్లా కలెక్టర్ గారు మాట్లాడుతూ, ప్రధానమంత్రి విశ్వకర్మ ప్రోగ్రాం ద్వారా జిల్లాలో 7200 మందికి శిక్షణ ఇవ్వటం జరిగిందని, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి, వారి వారి విభాగాల విధంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా డైరెక్ట్ గా వారి ఇంటికే వారి పనిముట్లు చేయడం జరుగుతుందని, వాటి ద్వారా శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ వారి జీవితాన్ని మెరుగుపరుచుకోవాలని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజా మరియు, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు పాల్గొన్నారు

## పెసలబండలో ఘనంగా కబడ్డీ పోటీలు -- 25 జట్ల మధ్య పోటీ, నాలుగు జట్లకు బహుమతులు



ఆదోని, ఏప్రిల్ 28 (అనంత ప్రభ )

కర్నూలు జిల్లా ఆదోని మండలం పెసలబండ గ్రామంలో మహిమల దేవుడు సద్గురు పోతులూరు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల 39వ ఆరాధన మహోత్సవం సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. మొత్తం 25 జట్లు పోటాపోటీగా ఆడి ప్రేక్షకులను అలరించాయి.విజేతలు:

ప్రథమ బహుమతి -- ఆదోని౼ా= టీం ద్వితీయ బహుమతి -- పెసలబండ జట్టు తృతీయ బహుమతి -- చిన్నతుంబళం జట్టు

నాలుగో బహుమతి -- ధానాపురం జట్టు ఈ పోటీలకు బహుమతులు అందించిన దాతలు: కొంక సిద్ధార్థ నాయుడు, జి లక్ష్మన్న, మాధవ్, ఎస్.ఎన్.డి.జే, కే బ్రహ్మయ్య మరియు ఇతరులు. మ్యాట్ ఏర్పాటుకు సిహెచ్ వెంకట్రావు సహకారం అందించారు.పోటీల నిర్వహణలో గ్రామ పెద్దలు మరియు యువకులు ముఖ్య పాత్ర పోషించారు. సహకరించినవారిలో వెంకట్రావు, డీజే రవికుమార్ గౌడ్, ఎన్ బ్రహ్మయ్య, ఏ బ్రహ్మయ్య, జి కృష్ణ, జి మల్లికార్జున, ఎస్ బ్రహ్మయ్య, ఎం మారెప్ప, జి బజారి, బి ఈరప్ప, ఎస్ హనుమంత్ రెడ్డి, శ్రీకృష్ణ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కొంక సిద్ధార్థ నాయుడు మాట్లాడుతూ, "పెసలబండ గ్రామంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉంది. గ్రామ ప్రజలందరికీ స్వామి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాను. క్రీడలలో యువత ముందుకు రావాలి" అని తెలిపారు.అలాగే డీజే రవికుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఉత్సవాలకు హాజరైన కొంక సిద్ధార్థ నాయుడికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఆయన భవిష్యత్తులో మంచి నాయకుడిగా ఎదగాలని ఆకాంక్షించారు

## శ్రీ కీర్తిశేషులు ఉగ్గాని మల్లయ్యకు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ప్రత్యక్ష దర్శన భాగ్యం



ఆదోని, ఏప్రిల్ 28 (అనంత ప్రభ )

ఆదోని మండలం పెసలబండ గ్రామంలో మహిమల దేవుడైన సద్గురు పోతులూరు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల 39వ ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా రథోత్సవం భక్తుల మధ్య అంగరంగ వైభవంగా జరగగా, పరిసర ప్రాంతాలైన తారాపురం, రంగాపురం, సుల్తానాపురం, నాగలాపురం, మంత్రికి, దొడ్డనగిరి, పెద్దకడుబూరు, కోసిగి, నెమిలికల్ తదితర గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ మఠాన్ని దర్శించుకున్న వారికి కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన కీర్తిశేషులు ఉగ్గాని మల్లయ్యకు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ప్రత్యక్ష దర్శనం కలిగినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఒక రోజు స్వామిని దర్శించుకోవాలని సంకల్పించిన మల్లయ్య చెట్టు కింద నిద్రపోయి మేల్కొన్నప్పుడు ఆశ్చర్యకరంగా స్వామివారి మఠం వద్దకు చేరుకున్నాడని, అక్కడి బావిలో స్నానం చేసి దర్శనం చేసుకుని తిరిగి గ్రామానికి చేరుకున్నాడని, అలాగే రాత్రి సమయంలో స్వామి ప్రత్యక్షంగా దర్శనమిచ్చారని కుటుంబ సభ్యులు వివరించారు. పెసలబండ గ్రామంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠాన్ని ఉగ్గాని మల్లయ్య స్థాపించినట్లు గ్రామస్తులు తెలిపారు. అప్పటి నుండి ప్రతి సంవత్సరం హోమం, పల్లకి సేవ, రథోత్సవం వంటి కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ వేడుకల సందర్భంగా వచ్చిన భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేయగా, ఎస్సీ పోలీస్ స్టేషన్ సిబ్బంది సహకారంతో రథోత్సవం ప్రశాంతంగా జరిగింది. కార్యక్రమానికి సహకరించిన గ్రామ పెద్దలు, భక్తులందరికీ మఠాధిపతులు శ్రీనివాసులు, అన్వేషప్ప కృతజ్ఞతలు తెలిపారు. స్వామివారి మహిమలను ప్రత్యక్షంగా చూసినందుకు మా జన్మ సార్థకమైందని ఉగ్గాని మల్లయ్య కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

## ఎస్ ఎఫ్ ఐ, డి వై ఎఫ్ ఐ ఆధ్వర్యంలో కబడ్డీ ఫ్రెండ్లీ టోర్నమెంట్ నిర్వహణ




ఆదోని, ఏప్రిల్ 28 (అనంత ప్రభ )

ఆదోని పట్టణంలోని పార్వతిపురం ప్రాంతంలో శ్రీశ్రీ కాసిం తాత ఉరుసు సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ, డి వై ఎఫ్ ఐ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ ఫ్రెండ్లీ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌ను డివైఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు లక్ష్మన్న రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్, పట్టణ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ యువ క్రీడాకారులను పరిచయం చేసుకుని, టోర్నమెంట్ ఉద్దేశాన్ని వివరించారు. విద్యార్థులు, యువజనులు, నిరుద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూనే, యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి పండుగలు, స్వాతంత్ర్య సమరయోధుల జయంతులు, వర్ధంతులు వంటి సందర్భాలలో కూడా,క్రీడా,పోటీలు,నిర్వహించడం ద్వారా యువతను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.

ఆదోని పట్టణంలో సరైన ఆట స్థలాలు లేకపోవడంతోఅనేకమంది యువకులు క్రీడలకు దూరమవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే క్రీడాకారుల పట్ల ప్రేమ చూపిస్తున్న రాజకీయ నాయకులను వారు విమర్శించారు. ప్రభుత్వం క్రీడల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు.ఇలాంటి ఫ్రెండ్లీ టోర్నమెంట్‌ల ద్వారా యువతలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి సమాజానికి పరిచయం చేయడమే తమ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ యువకులు ముని, వీరేష్, సతీష్, మహబూబ్, అజయ్ తదితరులు, క్రీడాకారులు పాల్గొన్నారు.




## నేడు కమ్మూరు లో భూములు రీ సర్వే చేయనున్న రీ సర్వే అధికారులు



కూడేరు, ఏప్రిల్ 28 (అనంత ప్రభ)

కమ్మూరు గ్రామ రెవెన్యూ నందు రీసర్వే కార్యక్రమం ఈ క్రింద తెలుపబడిన సర్వే నంబర్లకు సర్వే టీం హాజరు అయి భూముల రీ సర్వే నిర్వహిస్తున్నట్లు రీ సర్వే సర్వే డిప్యూటీ తాసిల్దార్ తెలిపారు. 29/04/2026. తేదీ బుధవారం రోజున 204,223,224,225,226,227,221 సర్వే నంబర్లకు గ్రౌండ్ టృతింగ్ జరుగుతుంది. కావున ఈ సర్వే నంబర్లకు సంబంధించిన రైతులు వారి పొలాల వద్దకు వచ్చి హద్దులు చూపించవలసినదిగా కోరడమైనది.రైతులు అందరు పొలం వద్దకు వచ్చినప్పుడు

గ్రామ సర్వే టీమ్ కు రైతుల భూములకు సంబంధించిన డాక్యుమెంట్స్ ను కాఫీ లను అంద చేయాలిని ఈ సర్వే డిప్యూటీ తహశీల్దారు ప్రసాద్ తెలియజేశారు


## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ కమిటీ



ఆత్మకూరు, ఏప్రిల్ 28 (అనంత ప్రభ)

ఆత్మకూరు మండలం పంపునూరు గ్రామంలో వెలసినటువంటి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి మంగళవారం సంధర్భంగా స్వామి వారికి పాలాభిషేకం పంచామృత అభిషేకం, అలంకరణ,ఆకుపూజ ,అర్చన మహానైవేద్యం , మహామంగళహారతి, పల్లకి సేవ మరియు రాహు కాలం పూజలో భాగంగా కుజదోష కాలసర్పదోష సర్పదోష నివారణ కొరకు "శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూల మంత్ర బీజాక్షర హోమము" నిర్వహించడమైనది భక్తులు స్వామివారి అభిషేకం మరియు హోమము నందు పాల్గొన్నట్టు ఆలయ కార్య నిర్వహణ అధికారి బి బాబు తెలియజేశారు.

## మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా రూపొందించడమే లక్ష్యం -జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్



పుట్టపర్తి, ఏప్రిల్ 28 (అనంత ప్రభ )

కలెక్టరేట్ లోని మినీ కన్ఫారెన్స్ హాలు నందు శ్రీ సత్యసాయి జిల్లాలో మాదక ద్రవ్యాల (నార్కోటిక్స్) నిర్మూలనకు కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఎన్-కార్డ్ కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ , ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గారు మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. పాత కేసుల్లోని నిందితులపై నిరంతరం నిఘా ఉంచి, వారిని బైండోవర్ చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలించాలని అధికారులను ఆదేశించారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ సమావేశంలో అనంతపురం అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్, డీపీఈఓ గోవింద నాయక్, ఏఈఎస్ నరసింహులు మరియు పోలీస్ అధికారులు పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాద బాధితులకు 'పీఎం-రాహత్' ద్వారా నగదు రహిత చికిత్స



పుట్టపర్తి, ఏప్రిల్ 28 (అనంత ప్రభ )

కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం 'పీఎం-రాహత్' పథకానికి సంబంధించిన వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఆవిష్కరించారు.రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణమే ఉచితంగా, నగదు రహిత చికిత్స అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం.ప్రమాదం జరిగిన మొదటి 24 గంటల లోపు ఆసుపత్రిలో చేరిన వారికి అత్యవసర వైద్య సేవలు అందుతాయి.ఈ పథకం కింద ఒక వ్యక్తికి గరిష్టంగా 1.5 లక్షల రూపాయల వరకు అత్యవసర చికిత్స కవర్ అవుతుంది. ఒకవేళ చికిత్స ఖర్చు 1.5 లక్షలు దాటితే, మిగిలిన మొత్తాన్ని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా వర్తింపజేస్తామని వైద్య సేవ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి వివరించారు.ఈ కార్యక్రమములో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్,ఆర్టీఓ కరుణసాగర్,ఎన్టీఆర్వైద్య ఆరోగ్య సేవ సమన్వయకర్త శ్రీ దేవి,డిసిహెచ్ఎస్ మధుసూదన్,డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సునీల్, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొని







## ఆశ్చర్యపరుస్తున్న హైదరాబాదీ ఇడ్లీ



స్విగ్గీ ఆర్డర్లలో ఇడ్లీయే రాజానండి బాబూ.. అల్పాహారాల్లో ఇడ్లీకి ఉన్న క్రేజ్ అలాంటిదండి మరి..!

ఎందుకటే గత ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా 3.3 కోట్ల ప్లేట్లను ఆ సంస్థ పంపిణీ చేసింది. అల్పాహార ప్రియుల్లో ఆ ఇడ్లీకి ఉన్న క్రేజ్ ఎంతో తన నివేదికలో వివరించింది. అంతేకాదు.. ఈ సిగ్గీ ద్వారానే హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి అరుదైన రికార్డు సొంత చేసుకున్నాడు. ఆ విశేషాలంటో చదివేద్దామా?

ఇడ్లీ.. ఇడ్లీ.. ఇడ్లీ.. అవును! ఇడ్లీకి ఉన్న క్రేజే వేరు. పూర్వకాలం నుంచి అల్పాహారంగా దీనినే తీసుకుంటున్నారు. ఇడ్లీ లేని హోటలూ ఉండదు. బెంగళూరు వాసులు రవ్వ ఇడ్లీలు, చెన్నై వాసులు నెయ్యి, పొడి ఇడ్లీలు ఇష్టపడితే.. హైదరాబాద్ వాసులు కారం పొడి, నెయ్యి, చట్నీలతో కూడిన ఇడ్లీలు ఇష్టపడతారు. అందుకే ఈ ఇడ్లీలకు ఎక్కడైనా డిమాండ్ ఉంటుంది. వీటి ద్వారా హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఓ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు.

ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ ద్వారా గత ఏడాది కాలంగా రూ.ఆరు లక్షలను కేవలం ఇడ్లీల కోసమే ఖర్చు చేశాడంట. ఇడ్లీలంటే తనకు ఎంత ఇష్టమో ఈ రికార్డు ద్వారా నిరూపించాడు. తన కోసమే కాదు.. తన కుటుంబసభ్యులు, స్నేహితుల కోసం ఏడాది మొత్తంలో 8428 ప్లేట్ల ఇడ్లీలను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేశాడు. ఒక్క హైదరాబాద్‌లోనే కాదు.. తాను ఎక్కడికి వెళితే అక్కడ స్విగ్గీలో ఆర్డర్ ఇచ్చేయడం ఈయనకు అలవాటు.

ప్రపంచ ఇడ్లీ దినోత్సవం నాడు ఇడ్లీ ఆర్డర్లపై నిర్వహించిన అధ్యయన నివేదికను స్విగ్గీ సంస్థ విడుదల చేసింది. మరోవైపు ఈ సంస్థ గత ఏడాదికాలంలో దేశవ్యాప్తంగా 3.3 కోట్ల ప్లేట్ల ఇడ్లీలను పంపిణీ చేసినట్టు తెలిపింది. ఆ నివేదిక ప్రకారం ఎక్కువ ఇడ్లీలను ఆర్డర్ చేసిన నగరాల్లో బెంగళూరు, హైదరాబాద్, చెన్నై మొదటి మూడు స్థానాల్లో నిలిచినట్టు తెలిపింది.

కోల్‌కతా, కొచ్చి, ముంబై, కోయంబత్తూరు, పుణే, వైజాగ్, ఢిల్లీ నగరాలు నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది స్థానాల్లో ఉన్నాయి. చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, కోయంబత్తూరు, ముంబై వాసులు డిన్నర్‌గా కూడా ఇడ్లీని ఎక్కువ ఇష్టపడుతున్నట్టు స్విగ్గీ తన సర్వేలో వెల్లడించింది.

చాలా మంది రాత్రి పూట టిఫిన్‌చేసే వాళ్లు కూడా ఇడ్లీపైనే మక్కువ చూపిస్తున్నట్టు ఫుడ్ డెలవరీ సంస్థ స్విగ్గీ పేర్కొంది. అయితే అల్పాహార ఆర్డర్స్‌లో మసాలా దోశ మాత్రం ఫస్ట్ ప్లేస్‌లో ఉంటే, ఇడ్లీ దానిని అనుసరిస్తోంది.

## మామిడిపండుతో టేస్టీ అండ్ సింపుల్ రెసిపీలు

సీజనల్ ఫ్రూట్ మామిడిపండు. వేసవిలో మాత్రమే దొరికే ఈ పండును కచ్చితంగా తినమని చెబుతారు పోషకాహార నిపుణులు. విటమిన్ సి, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటో న్యూట్రియెంట్లు అధికంగా ఉంటాయి. ఇది తినడం వల్ల మన శరీరం ఇనుమును సులువుగా శోషించుకుంటుంది. జీర్ణ క్రియను మెరుగుపరుస్తుంది. రోగనిరోధక వ్యవస్థకు మామిడిపండు ఎంతో అవసరం. అలాగే బరువు తగ్గించే డైట్ లో కూడా ఇది ఒక భాగం. వీటిని తింటూ బరువును సులువుగా తగ్గొచ్చు. వైద్యులు కూడా ఆరోగ్యకరమైన ఆహారాన్ని తింటూ బరువు తగ్గమని సూచిస్తారు. మామిడి పండుతో సింపుల్‌గా చేసుకునే రెసిపీలు ఇవిగో. వీటిని పెద్దగా వండాల్సిన అవసరం లేదు.

మామిడిపండు ఓట్స్ స్మూతీ
ఓట్స్ – రెండు స్పూన్లు
మామిడిపండు – ఒకటి
చియా సీడ్స్ – ఒక స్పూన్
నీళ్లు – ఒక గ్లాసు

తయారీ ఇలా
1. స్టవ్ మీద కళాయిని పెట్టి అందులో ఒక గ్లాసు నీరు వేయాలి.
2. ఆ నీళ్లలో ఓట్స్, చియా సీడ్స్ వేసి ఉడికించాలి అవి మెత్తగా అయ్యాక చల్లారనివ్వాలి.
3. ఈ మొత్తం మిశ్రమాన్ని బ్లెండర్లో వేసి జ్యూస్ లా చేసుకోవాలి. 4. ఆ మిశ్రమాన్ని ఒక గ్లాసులో వేసి పైన మామిడి పండు ముక్కలను వేసుకోవాలి. మామిడి పండు ఓట్స్ స్మూతీ రెడీ అయినట్టే.

కొబ్బరితో మామిడిపండు ఓట్ మిల్
లేత కొబ్బరి – 50 గ్రాములు
కొబ్బరి పాలు – అర గ్లాసు
ఓట్స్ – అర కప్పు
మామిడిపండు ముక్కలు – అరకప్పు
డ్రై ఫ్రూట్స్ తరుగు – గుప్పెడు
తేనె – ఒక స్పూను
యాలకుల పొడి – చిటికెడు

1. ఒక గిన్నెలో పైన చెప్పిన అన్ని పదార్థాలను వేసి బాగా కలిపి రాత్రంతా ఉంచాలి.
2. గిన్నెపై మూత పెట్టడం మర్చిపోవద్దుచ లేదా ఫ్రిడ్జ్ లో పెట్టినా మంచిదే.
3. ఉదయం లేచాక వాటిని అల్పాహారంగా తింటే ఆరోగ్యానికి మంచిది. రుచి కూడా అదిరిపోతుంది.



మామిడి సలాడ్
వర్జిన్ ఆలివ్ ఆయిల్ – ఒక స్పూను
పాలకూర – గుప్పెడు
మామిడిపండు – ఒకటి
తేనె – ఒక స్పూను
మిరియాల పొడి– చిటికెడు

1. పాలకూర ఆకులను బాగా కడిగి సన్నగా తురుముకోవాలి.
2. మామిడిపండును కూడా సన్నగా తరగాలి.
3. సలాడ్ చేయడానికి ఒక గిన్నెను తీసుకొని అందులో ఆలివ్ ఆయిల్ వేసి గిన్నె కింద అడుగుభాగానికి బాగా పట్టించాలి.
4. ఆ గిన్నెలో పాలకూర తరుగును, మామిడిపండు తరుగును వేయాలి.
5. వాటిని బాగా కలపాలి. తేనే, పెప్పర్ కూడా చల్లి బాగా కలుపుకోవాలి.
6. ఆలివ్ ఆయిల్‌ను పైన చల్లుకొని సలాడ్ తినాలి.
ఈ మామిడి సలాడ్ కంటికి, చర్మానికి, మెదడుకు, కాలేయ పనితీరుకు మేలు చేస్తుంది.

## దగ్గుతో బాధపడుతుంటే కేవలం 10 నిమిషాల్లో ఇలా సిరప్‌ను ఇంట్లోనే తయారు చేసుకోండి

వాతావరణంతో పాటు వచ్చే రోగాల్లో ముఖ్యమైనవి జలుబు, దగ్గు, జ్వరం, అలెర్జీలు. వీటిలో అతి సాధారణంగా జలుబు, దగ్గు ఎక్కువ మందిని ప్రభావితం చేస్తాయి. మార్కెట్లో దొరికిన దగ్గు సిరప్‌లనే ఎక్కువ మంది వినియోగిస్తారు. అయితే పూర్వం ఈ దగ్గు సిరప్‌లు ఏవి ఉండేవి కాదు. వారు ఇంట్లోనే దగ్గుకు ఔషధాన్ని తయారు చేసుకొని తాగేవారు. కేవలం కొన్ని నిమిషాల్లోనే ఇది తయారైపోతుంది. ఎలాంటి సైడ్ ఎఫెక్టులూ ఉండవు. కాబట్టి సహజ పద్ధతిలో మీరు కూడా ఇంట్లోనే ఇలా దగ్గు సిరప్ తయారు చేసుకొని తాగితే మంచిది.

ఇంట్లోనే దగ్గు ఔషధం తయారీకి ఐదు పదార్థాలు కావాలి. తేనే, మిరియాలు, తులసి, అల్లం,



నిమ్మకాయ వంటి వాటితో ఈ ఔషధాన్ని తయారు చేస్తారు. వీటన్నింటిలో కూడా విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో నొప్పిని, మంటను నయం చేస్తాయి. శ్వాసకోశ సమస్యలను దూరం చేస్తాయి. చల్లని వాతావరణంలో వచ్చే వ్యాధులతో పోరాడుతాయి. వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి.

తయారీ ఇలా..
ఈ దగ్గు సిరప్ తయారు చేయడానికి ముందుగా కళాయిని స్టవ్ మీద పెట్టండి. ఆ కళాయిలో ఒక కప్పు నీరు, రెండు టేబుల్ స్పూన్ల అల్లం తరుగు, తరిగిన నిమ్మకాయ ముక్కలను వేయండి. మిశ్రమం సగానికి తగ్గేవరకు చిన్న మంట మీద మరిగించండి. తరువాత అర స్పూను మిరియాల పొడిని జోడించండి. అందులోనే నాలుగు తులసి ఆకులు వేసి మరిగించండి. తర్వాత స్టవ్ కట్టేయండి. గోర-ువెచ్చగా మారాక ఒక స్పూను తేనెను అందులో కలపండి. ఆ మిశ్రమాన్ని ఒక సీసాలో వేసి భద్రపరుచుకోండి. మూడు పూటలా భోజనం చేశాక ఒక టేబుల్ స్పూన్ ఔషధాన్ని తాగండి. ఇలా వారం రోజులపాటు ఈ ఔషధాన్ని సేవిస్తే దగ్గు సహజసిద్ధంగానే తగ్గిపోతుంది. సాధారణంగా వచ్చే దగ్గు అయితే ఈ ఔషధాలకు నయం అవుతుంది. ఈ ఔషధానికి దగ్గు నయం కాకుండా ఉంటే అది తీవ్రమైనదిగా పరిగణించవచ్.చు అప్పుడు వైద్యులను కలిసి అల్లోపతి మందులను వాడండి.

దగ్గు మందుల వల్ల తీవ్రమైన సైడ్ ఎఫెక్టులు వస్తున్నట్టు ఇప్పటికే ఎన్నో వార్తలు వచ్చాయి. కొన్ని దేశాల్లో కొన్ని రకాల దగ్గు మందులను నిషేధించారు. దానికి కారణం అందులో వాడుతున్న కొన్ని రసాయన సమ్మేళనాలే. ఇలా ఇంట్లోనే సహజసిద్ధంగా దగ్గు ఔషధాన్ని తయారు చేసుకుంటే, ఎలాంటి సైడ్ ఎఫెక్టులు ఉండవు. చెడు ప్రభావాలు పడవు. ఈ మందు మీకు సరిగా పనిచేయకపోయినా, దీనివల్ల కలిగే నష్టం మాత్రం ఉండదు. కాబట్టి ఒకసారి దగ్గుకు ఈ ఔషధాన్ని తయారు చేసుకొని వాడి చూడండి. మీకు దీని వల్ల దగ్గు తగ్గితే భవిష్యత్తులో అల్లోపతి మందులు వాడాల్సిన అవసరం ఉండదు.

## మామిడిపండుతో మిల్క్‌షేక్.. వెరీ

పాలు ఆరోగ్యానికి చాలా మంచిది. ఏకాలమైనా వీటిని తీసుకోవాల్సిందే. అయితే, ఎండాకాలంలో పాలని వేడిగా తీసుకునే బదులు చల్లగా తాగితే బావుంటుంది కదా. అందుకే బెస్ట్ సమ్మర్ స్పెషల్ 5 మిల్క్ షేక్స్ చూడండి. వీటిని మీ డైట్‌లో చేర్చుకోండి.

డేట్ వాల్‌నట్ మిల్క్ షేక్

కావాల్సిన పదార్థాలు..

6 ఖర్జూరాలు 1 టేబుల్ స్పూన్ ఎండు ద్రాక్ష, 5 వాల్‌నట్స్ 1 కప్పు చల్లని పాలు.
తయారీ విధానం.. గిన్నెలో ఖర్జూరం, వాల్‌నట్స్, ఎండుద్రాక్ష వేయాలి. అరకప్పు వేడి నీటిని పోసి వాటిని 15 నిమిషాల పాటు నానబెట్టండి. నీటిని తీసి డేట్స్, వాల్‌నట్స్, ఎండుద్రాక్షలు వేసి బ్లెండ్ చేయండి. 1 కప్పు చల్లని పాలని బ్లెండర్ పోసి బాగా కలపండి. అంతే డేట్ వాల్‌నట్ మిల్క్ షేక్ రెడీ.

యాపిల్ బనానా మిల్క్ షేక్..
కావాల్సిన పదార్థాలు..

1 చిన్న ఆపిల్, 1 అరటిపండు, అర టీస్పూన్ యాలకుల పొడి, 1 కప్పు పాలు, 1 టేబుల్ స్పూన్ తేనె.

తయారీ విధానం..

యాపిల్, అరటిపండు తొక్కని తీసి ముక్కలుగా కట్ చేసి బ్లెండర్‌లో వేయండి. ఇప్పుడు తేనె, యాలకుల పొడి కూడా వేయాలి. దీనంతటిని మెత్తగా మిల్క్‌షేక్‌లా అయ్యే వరకూ బ్లెండ్ చేసి సర్వ్ చేయడమే.

మ్యాంగో మిల్క్ షేక్..
కావాల్సిన పదార్థాలు..
1 మామిడి పండు 1 కప్పు పాలు, 5 జీడిపప్పులు, 1 టేబుల్ స్పూన్ తేనె, చిటికెడు కుంకుమ



పువ్వు, తయారీ విధానం..

ఇప్పుడు బ్లెండర్‌లో మామిడిపండు, పాలు, జీడిపప్పు, చక్కెర, కుంకుమపువ్వు వేయండి. మెత్తగా షేక్‌ల చేయండి. దీనిని గ్లాసులో పోసి మామిడి పండు ముక్కలతో గార్నిష్ చేయండి.

డ్రై ఫ్రూట్ మిల్క్ షేక్..

డ్రై ఫ్రూట్స్ ఆరోగ్యానికి చాలా మంచిది. అందుకే, సమ్మర్‌లోనూ వీటిని షేక్స్‌లో వాడొచ్చు. అందుకోసం ఏమేం కావాలంటే..

10 జీడిపప్పులు, 5 బాదంపప్పులు, 5 పిస్తా పప్పులు 1 టీ స్పూన్ నానబెట్టిన ఎండుద్రాక్ష, 1 కప్పు పాలు 2 టీ స్పూన్ చక్కెర మీరు మరింత హెల్దీగా తాగాలనుకుంటే తేనె కూడా తీసుకోవచ్చు. చిటికెడు కుంకుమపువ్వు.
తయారీ విధానం.. ఓ గిన్నెలో జీడిపప్పు, బాదం, పిస్తా వేసి పావు కప్పు పాలు పోసి 10 నిమిషాలు నాననివ్వండి. ఇప్పుడు మిగిలిన పాలతో కలిపి బ్లెండ్ చేయండి. ఇప్పుడు కుంకుమపువ్వు, తేనె కూడా వేసుకి మెత్తగా మిల్క్ షేక్ చేసుకోండి. అంతే టేస్టీ మిల్క్ షేక్ రెడీ అయినట్లే.

## వేసవి తాపాన్ని తగ్గించి చల్లగా ఉంచే సూపర్ ఫుడ్స్



సూర్యుడి నెత్తి మీదకు చేరి చెమటగా మారి నాట్యమాడేస్తున్నాడు. వేసవి ఉక్కపోత నుంచి బయట పడటం చాలా కష్టం. కొంతమందికి అయితే చెమటలు కారుతూనే ఉంటాయి. ఫ్యాన్, ఏసీ, కూలర్ ముందే కూర్చుని సేద తీరతారు. చల్లని ఐస్ క్రీమ్స్, డ్రింక్స్ తాగితే పొట్ట కూడా హాయిగా ఉంటుంది. కొన్ని ఆరోగ్యకరమైన ఆహారాలు ఈ వేసవిలో శరీరానికి సరిపోకపోవచ్చు. కానీ కొన్ని మాత్రం శరీరాన్ని చల్లగా ఉంచుతాయై. వేడిని సహజంగా తగ్గించడంలో మీకు సహాయపడే కొన్ని సూపర్ ఫుడ్స్ ఇవే. వీటిని తీసుకుంటే మండే ఎండలో కూడా చల్లగా ఉండవచ్చు.

- ఖుస్ గడ్డి నుంచి తయారు చేసేది ఖుస్ షర్బత్. ఇది మిమ్మల్ని హైడ్రేట్ గా ఉంచడంలో సహాయపడుతుంది. అధిక వేడి వల్ల కళలు ఎర్రగా మంటలు అనిపిస్తాయి. ఆ ఫీలింగ్ తగ్గాలంటే ఖుస్ షర్బత్ తాగాల్సిందే.

- శరీరాన్ని చల్లబరిచే మరొక అద్భుతమైన పదార్థం సబ్జా. ఒక బాటిల్ నీళ్ళలో సబ్జా గింజలు వేసుకుని తాగుతూ ఉంటే చాలా బాగుంటుంది.

- కోకుమ్ జ్యూస్ తాగితే శరీరంలోని వేడి, మంట తగ్గించడానికి ఇదొక గొప్ప మార్గం. శరీరాన్ని చల్లబరుస్తుంది. నిర్జలీకరణాన్ని తగ్గిస్తుంది. వడదెబ్బ నుంచి రక్షణగా నిలుస్తుంది.

- బార్లీ నీరు నిర్జలీకరణాన్ని నివారించడంలో సహాయపడుతాయి. పుదీనా, కొత్తిమీర ఆకులు శరీరంలోని వేడిని తొలగిస్తాయి. శరీరంలోని వ్యర్థాలను తొలగించేస్తాయి.

ఇవి మీకు చల్లదనాన్ని మాత్రమే కాదు ఆరోగ్యాన్ని ఇస్తాయి. వేసవిలో ఈ ఉత్తమమైన ఆహారాలు చాలా తేలికగా ఉంటాయి. మిమ్మల్ని రిఫ్రెష్ గా ఉంచుతాయి. వేడిని దూరం చేస్తాయి. ఇవే కాదు కాలానుగుణమైన పండ్లు, కూరగాయలు తీసుకుంటే దాహాన్ని తీర్చేస్తాయి. ఇవే కాదు కొబ్బరి నీళ్ళు, పుచ్చకాయ, మజ్జిగ, కొత్తిమీర ఆకులు, పుదీనా ఆకులు, కీరదోస తీసుకున్నా మంచిది. కొబ్బరి నీళ్ళు తీసుకోవడం వల్ల శరీరం కోల్పోయిన ఎలక్ట్రోలైట్స్‌ని తిరిగి భర్తీ చేస్తుంది. తక్షణ శక్తిని అందిస్తుంది.

AP 4PG 29 - 4- 2026 WEDNESDAY qxp_Layout 1 29-04-2026 06:00 AM Page 4



# 250 ఏళ్ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల.. రెమ్యునరేషన్ ఎన్ని కోట్లంటే?





కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మైసూర్ శాండల్ సోప్‌కు స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై కన్నడ సీమ రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. దాదాపు 6.2 కోట్ల పారితోషికంతో తమన్నాకు ఈ బాధ్యతను కట్టబెట్టింది సిద్ధరామయ్య ప్రభుత్వం. అయితే కర్ణాటకలో ఎంతో మంది ప్రముఖులు, ప్రతిభావంతులు ఉండగా పరాయి రాష్ట్రానికి చెందిన నటిని మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. కర్ణాటక సంఘాలు, పార్టీలు, ప్రముఖులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకి చెందిన యువ కథానాయిక శ్రీలీల అదిరిపోయే ఆఫర్ అందుకున్నారు. ఈ వివరాల్లోకి వెళితే..

చేతినిండా సినిమాలతో శ్రీలీల బిజీ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా ఉన్న హీరోయిన్ ఎవరంటే ఖచ్చితంగా వినిపించే పేరు శ్రీలీల. ధమాకాతో లైమ్ లైట్‌లోకి వచ్చిన ఈ ముద్దగుమ్మ ఆ తర్వాత భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇక పుష్ప 2లో కిస్సిక్ సాంగ్‌తో దేశాన్ని ఊపేసి నేషనల్ వైడ్ పాపులర్ అయ్యింది. అందం, అభినయం, డ్యాన్స్‌తో క్రేజీ ఆఫర్లు పట్టేస్తోంది. చాలా చిన్న వయసులోనే బాలీవుడ్ ఆఫర్ కూడా అందుకోవడంతో శ్రీలీల అదృష్టంపై సీనియర్ హీరోయిన్లు, అప్ కమింగ్ హీరోయిన్లు అసూయ పడుతున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ వల్ల కానిది శ్రీలీల ఈజీగా సాధిస్తోందని కుళ్లుకుంటున్నారు.

ఆషికి 3తో బాలీవుడ్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికి 3 అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు శ్రీలీల. అనురాగ్ బసు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా శరవేగంగా సినిమాను పరుగులు పెట్టిస్తున్నాడు అనురాగ్. అయితే అషికి 3 ఇంకా సెట్స్ మీద ఉండగానే శ్రీలీల హిందీలో మరో ఆఫర్ అందుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా సరసన శ్రీలీల ఆడిపడనుందట. ఆనంద్ ఎల్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. రాజ్ సాండియాలా దర్శకత్వం వహిస్తారని బీటౌన్ టాక్. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక తెలుగులో జూనియర్, మాస్ జాతర, లెనిన్, తమిళంలో పరాశక్తి సినిమాలలో శ్రీలీల నటిస్తున్నారు.

టాప్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తోనూ ఈ ముద్దుగుమ్మ భారీగా సంపాదిస్తోందట. న్యూడ్ స్కిన్ కేర్, అమృత గ్రూప్, ప్రెస్టా వుమెన్స్ వేర్, నీరూస్ తదితర బ్రాండ్స్‌కు శ్రీలీల అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా శ్రీలీల అండార్స్‌మెంట్స్ కెరీర్‌లోనే మైల్ స్టోన్ అనదగ్గ ఆఫర్ వచ్చింది.

శ్రీలీలతో యూకే కంపెనీ డీల్ పర్సనల్ కేర్, కాస్మోటిక్స్, ఫ్రాగ్‌రెన్సెస్ విభాగంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన యార్డ్లే లండన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీకి దాదాపు 255 ఏళ్ల చరిత్ర ఉండగా.. ప్రపంచంలోని అత్యంత పురాతన కంపెనీల్లో ఒకటిగా యార్డ్లేకు పేరుంది. 2009లో యార్డ్లేను భారత కార్పోరేట్ దిగ్గజం విప్రో ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ సంస్థలోని ఫ్రాగ్‌రెన్సెస్ విభాగానికి గాను భారత్‌లో శ్రీలీల ప్రమోట్ చేయనుండటం విశేషం.

పారితోషికం ఎంతంటే? అయితే ఇందుకు గాను శ్రీలీల ఎంత మొత్తంలో పారితోషికం అందుకుంటున్నారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం బ్రాండ్ ప్రమోషనింగ్ కోసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య శ్రీలీల ఛార్జ్ చేస్తుండటంతో ఇది కూడా అదే స్థాయిలో లేదా ఆపైనా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యార్డ్లే నుంచి శ్రీలీల పారితోషికంగా ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.




# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..

ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేరువైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.


అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యూరిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు.పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# మహేష్ బాబు వదిలేసిన 1800 కోట్ల సినిమా.. థియేటర్లు బద్దలయ్యేవి.. ఆ మూవీ ఏంటంటే?





సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే మూడవ షెడ్యూల్ జరుగుతోంది. చిత్రీకరణ విషయంలో మాత్రం జక్కన్న ఎస్. ఎస్. ఎం.బి 29 సినిమాను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. అది సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటివరకు రెగ్యులర్ క్యారెక్టర్లలోనే నటిస్తూ వచ్చారు. కానీ అభిమానులు మాత్రం ఆయనను పవర్ఫుల్ రోల్స్ లో చూడాలని ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేష్ బాబు వదిలేసుకున్న 1870 కోట్ల సినిమా గురించి తాజాగా న్యూస్ బయటకు వచ్చింది. ఆ సినిమా చేసి ఉంటే మాత్రం మహేష్ బాబు ఇండియా ను షేక్ చేసే వారిని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఆ సినిమా ఏంటో తెలిస్తే అందరూ షాక్ అవ్వాల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప చిత్రమే కావడం విశేషం. అయితే ఈ సినిమాకు మొదట హీరోగా మహేష్ బాబు అని అనుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తోంది. కానీ మహేష్ బాబు ఆ సినిమాలు వదులుకోవడంతో అల్లు అర్జున్ వద్దకు వెళ్లిందని ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసలు నడుస్తున్నాయి. ఇక అల్లు అర్జున్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ తో పుష్ప, పుష్ప 2 చిత్రాలు ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రీసెంట్ గా వచ్చిన పుష్ప 2 చిత్రం ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. 1870 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసి ఇండియాలోనే హైయెస్ట్ గ్రాస్ కలెక్ట్ చేసిన రెండవ సినిమాగా రికార్డు సెట్ చేసింది. బాహుబలి 2 సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్ల 1810 కోట్లను దాటేసి మరి ఈ రికార్డును సెట్ చేయడం సెన్సేషన్ గా మారింది. మన వైపు అల్లు అర్జున్ కు పుష్ప పాత్రలో నటించినందుకు ఏకంగా బెస్ట్ యాక్టర్ విభాగంలో నేషనల్ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఇక నెక్స్ట్ పుష్ప 3 కూడా రాబోతుంది. ఆ పార్ట్ లో విజయ్ దేవరకొండ నటిస్తారని తెలుస్తోంది.

అయితే ఇంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిన పుష్ప చిత్రాన్ని మహేష్ బాబు ఎందుకు వదులుకున్నారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. అయితే పుష్ప చిత్రం ప్రారంభానికి ముందు మహేష్ బాబు ఇంట్లో వరుసగా విషాదాలు నెలకొనడం, గుంటూరు కారం చిత్రం తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తో సినిమాకు కమిట్ అవ్వడమే కారణం అని తెలుస్తుంది. ఇక పుష్ప చిత్రమే కాదు, శంభాజీ మహారాజ్ జీవిత కథతో వచ్చిన చావా చిత్రాన్ని కూడా మహేష్ బాబు వదిలేసారంట. ఈ హిస్టారికల్ ఫిలిం లో మహేష్ బాబు నటించిన మాత్రం మరింత బీభత్సం సృష్టించే వారిని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఇలా తన ముందుకు వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ మూవీస్ ను మహేష్ బాబు వదులుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎస్. ఎస్. ఎం.బి 29 తో మాత్రం ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను చెల్లాచెదురు చేస్తారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఆ ప్రాజెక్టుకు మార్కెట్లోనూ భారీ డిమాండ్ ఉండింది.

# భైరవం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

వీపురంలో జమీందార్ వంశానికి చెందిన గజపతి (మనోజ్ మంచు)కి గ్రామంలో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ.. పేదరికం వెంటాడుతుంటుంది. గజపతికి తన ఊరిలోనే పెద్దరికాన్ని ప్రదర్శించే వరద (నారా రోహిత్), అనాథగా బతికే శ్రీను (బెల్లంకొండ శ్రీను) ప్రాణస్నేహితులుగా ఉంటారు. ఇదిలా ఉండగా, ఆ గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా గజపతి నానమ్మ (జయసుధ) ఉంటారు. ఆలయ భూములు కాజేయడానికి మంత్రి (శరత్ లోహితస్య) పన్నాగం పన్నుతాడు.

అనాథ అయినప్పటికీ శ్రీనును కన్నబిడ్డగా ప్రజలు ఎందుకు చూస్తారు? శ్రీనుతో వెన్నెల (అదితి శంకర) లవ్ ట్రాక్ ఎలా సాగింది? గజపతిని భార్య నీలిమ (ఆనంది) ఎలా వేధించింది. భార్య ఒత్తిళ్లకు గజపతి తన మనసును ఎలా మార్చుకొన్నాడు. ప్రాణస్నేహితులుగా ఉండే గజపతి, వరద, శ్రీను మధ్య మంత్రి ఎలా చిచ్చు పెట్టారు. వరద స్నేహం కోసం ప్రాణాలిచ్చేంత ప్రేమ ఉన్న గజపతి తన స్నేహితులకు ఎందుకు ఎదురు తిరిగాడు? వరద, గజపతి, శ్రీను మధ్య విభేదాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి? అనే ప్రశ్నలకు సమాధానమే భైరవం సినిమా కథ.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ (సంపత్ రాజ్) తన ఉద్యోగానికి రాజీనామాను పై అధికారికి సమర్పించడంతో సినిమా హై నోట్‌లో మొదలవుతుంది. తన రాజీనామాకు కారణం చెప్పడం మొదలు పెట్టడంతో దేవీ పురంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల కథను ఎమోషనల్‌గా దర్శకుడు ప్రారంభించాడు. ముగ్గురు హీరోల ఇంట్రడక్షన్, ఎలివేషన్స్‌ను బాగానే డిజైన్ చేశాడు. ఆ తర్వాత శ్రీను ప్రేమ కథ, వరద, గజపతి ఫ్యామిలీ మధ్య ఉండే అన్యోన్యతను, కథను ఎస్టాబ్లిష్ చేయడానికి కాస్త టైమ్ ఎక్కువగా తీసుకొన్నట్టు అనిపిస్తుంది. ఫస్టాఫ్‌ను రెగ్యులర్, రొటీన్ ఫార్మాట్‌తో నడిపించినప్పటికీ.. ఇంటర్వెల్ ముందు పవర్‌ఫుల్ ఎపిసోడ్‌తో తొలిభాగాన్ని ముగించి సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచాడు.

అయితే ముగ్గురు హీరోల మధ్య ఎమోషన్స్, బాండింగ్‌ను బలంగా ఎస్టాబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ప్రయత్నం సరిగా చేయలేదనే ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగంతో చెప్పాల్సిన సన్నివేశాల్లో యాక్షన్ నింపడం వల్ల సినిమాలో సోల్ కాస్త మిస్ అయిందనిపిస్తుంది. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ.. మామిడితోట సీన్ నుంచి మూవీలో సన్నివేశాలు నెక్స్ట్ రేంజ్‌లోకి వెళ్తాయి. క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించిన తీరు విజయ్ కనకమేడల ప్రతిభ ఎంతో తెలుస్తుంది. సెకండాఫ్‌ను ఇంకాస్త బెటర్‌గా డిజైన్ చేయాల్సిందనే ఫీలింగ్ కలుగుతుంది. నటీనటుల ఫెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచాడు. సినిమాలోని ఎమోషనల్ కంటెంట్‌ను తన పాత్ర ద్వారా బాగా ఎలివేట్ చేశాడు. నటుడిగా మరింత మెచ్యూరిటీని చూపించాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ సన్నివేశాల్లో తనలోని నట విశ్వరూపాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. నారా రోహిత్, మనోజ్‌తో పాత్రలతో మమేకమై మంచి బాండింగ్‌ను ఆన్ స్క్రీన్‌పై ఎలివేట్ చేశాడు. ఇక మనోజ్ మంచు నటుడిగా మరో రేంజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. కాస్త విరామం తీసుకొన్నప్పటికీ.. సూపర్ క్యారెక్టర్‌తో రీ ఎంట్రీతో అదరగొట్టాడు. ఇండస్ట్రీలో తన టైమ్ స్టార్ట్ అయిందని గజపతి పాత్ర ద్వారా చాటి చెప్పాడు. నారా రోహిత్ విషయానికి వస్తే.. వరద పాత్రలో హుందాగా కనిపించాడు. తన పాత్రకు ఎంత ఎమోషన్ కావాలి? ఎంత యాక్షన్ కావాలో అంతే సమతుల్యాన్ని పాటించి సటిల్‌గా స్క్రీన్ పై కనిపించాడు. ఇక నాన్నమ్మగా జయసుధ పాత్ర అంతంత మాత్రమేగానే ఉన్నప్పటికీ.. స్క్రీన్ మీద కనిపించినంత సేపు ఆమె ప్రజెన్స్ బాగుంది. ఈ సినిమా కథను నడిపించే పాత్రలో నీలిమగా ఆనంది నటన బాగుంది. కేవలం గ్లామర్ పరంగానే కాకుండా ఆనంది పాత్రల స్వరూపాన్ని, సినిమా కథ దిశను మార్చే పాత్రలో ఒదిగిపోయింది. ఇక నారా రోహిత్ భార్య పాత్రలో పూర్ణిమగా దివ్య పిళ్లై ఎమోషనల్ కంటెంట్‌ను సినిమాకు అందించే విధంగా పెర్ఫార్మ్ చేశారు. వెన్నెల కిషోర్ కామెడీ పెద్దగా వర్క్ కాలేదు. సంపత్ రాజ్, శరత్, అజయ్, ఇతర పాత్రలు సినిమాలో గుర్తుంచుకొనే పాత్రల్లో కనిపించారు.

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే.. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ప్రధానమైన బలంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తోనే కాకుండా హీరోల ఇంట్రడక్షన్ సాంగ్ సంక్రాతి పాట, అలాగే వెన్నెల, గిచ్చు గిచ్చు సాంగ్ ఆడియో పరంగా ఫుల్ జోష్‌ను కలిగిస్తే.. తెర మీద అదే జోష్‌ను చూపించారు. ఇక ఈ సినిమాలో మంచి మాస్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. వాటితో గ్రామంలోని వాతవరణాన్ని హరి కె వేదాంతం చక్కగా, చాలా సహజంగా చిత్రీకరించాడు. కేకే రాధామోహన్ ఈ మూవీని రాజీ లేకుండా మంచి క్వాలిటీతో సినిమాను అందించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి. కంటెంట్‌పై మరింత దృష్టిపెట్టి ఉంటే బెస్ట్ మాస్ యాక్షన్ మూవీ అయి ఉండేదనిపిస్తుంది. తమిళంలో సూపర్ హిట్ అయిన గరుడన్ సినిమాకు భైరవం రీమేక్. ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉంటాయి. కొన్ని చోట్ల భావోద్వేగాలు లోపించాయి. యాక్షన్ పార్ట్ సినిమా ఫ్లేవర్‌ను మార్చేసింది. పాటల బాగున్నప్పటికీ వాటి ప్లేస్ మెంట్ సరిగా లేకపోవడం వల్ల మంచి ఫ్లోలో వెలుతున్న స్టోరికి బ్రేకులు వేశాయా? అనిపిస్తుంది. ఈ సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్. బెల్లంకొండ శ్రీను, నారా రోహిత్, మనోజ్ మంచు ఫెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలెట్. కథ పరంగా పాత కథే.. కాకపోతే డిఫరెంట్‌గా చేయాలన్న ప్రయత్నం కొంత ట్రాక్ తప్పింది. టోటల్‌గా ఈ సినిమాను థియేటర్‌లో ఓసారి చూసేయొచ్చు అనేది నా అభిప్రాయం.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com